





# ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియతో రెవెన్యూ సిబ్బందిపై అదనపు పని భారం

- ప్రత్యేక ఓటర్ జాబితా పనులతో పాటు రెగ్యులర్ విధులు చేయాలంటున్న అధికారులు
- పని ఒత్తిడితో తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల ఆవేదన
- రెగ్యులర్ విధుల నుంచి పూర్తి స్థాయి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్...

**మెదక్ సెప్టెంబర్ 04 (ప్రజా స్వరం)**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా కార్యక్రమం (ఎస్ఐఆర్) రెవెన్యూ శాఖలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు అదనపు పని భారంగా మారిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియలో భాగంగా తమను విధుల్లోకి కేటాయించిన ప్రభుత్వం, ఈ సమయంలో రెగ్యులర్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రత్యేక ఓటర్ జాబితా పనులతో పాటు సాధారణ విధులు కూడా నిర్వహించాలని అధికారులు సూచిస్తున్నారని వారు వాపోతున్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా తయారీ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ పనులు చేపట్టాల్సి వస్తోందని సిబ్బంది తెలిపారు. ఇంటింటి పరిశీలన, ఓటర్ల వివరాల పరిశీలన, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియ తదితర పనుల్లో నిమగ్నమై ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పనులతోనే సమయం సరిపోకపోతున్నప్పటికీ, మరోవైపు కార్యాలయాల్లో తమకు కేటాయించిన రెగ్యులర్ విధులను కూడా పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దరఖాస్తుదారుల నుంచి ఆగ్రహం**

రెవెన్యూ కార్యాలయాల్లో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సాధారణంగా కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ప్రత్యేక ఓటర్ జాబితా కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సి రావడంతో కార్యాలయాల్లో సాధారణ పనులు ఆలస్యమవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. దరఖాస్తుదారులు తమ పనుల కోసం కార్యాలయాలకు వచ్చిన సమయంలో సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడం లేదా పనులు వెంటనే పూర్తికాకపోవడంతో అసహనానికి గురవుతున్నారని తెలిపారు. కొంతమంది దరఖాస్తుదారులు తమ పనులు ఎందుకు కావడం లేదంటూ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తూ ఆగ్రహం



వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్ జాబితా పనులు, కార్యాలయంలో రెగ్యులర్ విధులు.. ఇలా రెండు రకాల బాధ్యతలను ఒకేసారి నిర్వహించాల్సి రావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని వారు అంటున్నారు.

**పని భారం గుర్తించాలి**

ప్రత్యేక ఓటర్ జాబితా కార్యక్రమం అత్యంత కీలకమైన ప్రక్రియ కావడంతో దానిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సిబ్బంది పేర్కొన్నారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ప్రత్యేక ఓటర్ జాబితా పనులు, మరోవైపు కార్యాలయంలో రెగ్యులర్ విధులు నిర్వహించడం వల్ల పనుల్లో నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సిబ్బందిపై ఉన్న పని భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా కార్యక్రమం పూర్తయ్యే వరకు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను రెగ్యులర్ విధుల నుంచి పూర్తిగా మినహాయించాలని, అవసరమైన అదనపు సిబ్బందిని కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయడంతో పాటు, ప్రజలకు అందాల్సిన రెగ్యులర్ రెవెన్యూ సేవలు కూడా సకాలంలో అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# బీసీ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం

**మేడ్చల్, ప్రజాస్వరం :**

కాంగ్రెస్ పార్టీ మరొకసారి బీసీ మరియు మహిళా వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుందని మునీరాబాద్ మాజీ సర్పంచులు గణేష్ నేత చిట్టి మిల్ల మరియు రాగజ్యోతి నేత చిట్టిమిల్ల తెలిపారు. ఒక బీసీ మహిళా బిడ్డని అత్యంత దారుణంగా క్యాబినెట్ ర్యాంకు నుంచి బర్తరఫ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని వారు వాపోయారు. కూతురు ఏదో మాట్లాడిందని తల్లిని శిక్షించడం అత్యంత దారుణమైన చర్య అని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక మాటలు మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తూర్పు జయప్రకాశ్ రెడ్డి లపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కేవలం కూతురేదో మాట్లాడిందని కొండా సురేఖని క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాల పార్టీగా మారిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇక రోజులు దగ్గర పడ్డాయని వచ్చే ఎన్నికల్లో బీసీలు, మహిళలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పద్మశాలీల ఆడబిడ్డను అవమానించిన మీ పార్టీకి పుట్టగతులు లేకుండా పోతుందని కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం పద్మశాలిలమంతా పనిచేస్తామని తెలిపారు...... ఈ కార్యక్రమంలో మునీరాబాద్ మాజీ ఉపసర్పంచ్ గుంద్రోల్ల నర్సింగరావు మునీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కైరం కొండ సత్యనారాయణ నేత, గుర్రం దేవేందర్ నేత, కైరం కొండ నరేందర్ నేత, గుర్రం జనార్ధన్ నేత, కైరం కొండ రవీందర్ నేత, చిట్టిమిల్ల అరుణ నేత, చిట్టిమిల్ల భవాని నేత తదితరులు పాల్గొన్నారు.




# శేరిపల్లి పాఠశాలలో ఘనంగా పాఠశాల రూపాంతర కార్యక్రమం

**వర్గల్ సెప్టెంబర్ 04 (ప్రజాస్వరం):-**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శేరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శేరిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో జన్మాష్టమి సందర్భంగా పాఠశాల రూపాంతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలకు వైట్‌వాష్ చేయడంతో పాటు ఆకర్షణీయమైన మ్యూరల్ ఆర్ట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను థామ్సన్ రాయిటర్స్ సంస్థ అందించింది. దీంతో పాఠశాల ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా మారింది. అనంతరం నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పావని మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల రూపాంతరానికి సహకరించిన థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రూపాంతరం వల్ల విద్యార్థులకు మెరుగైన, ఆహ్లాదకరమైన అభ్యాస వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో థామ్సన్ రాయిటర్స్, మ్యాజిక్ బస్ సంస్థల ఉద్యోగులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పాఠశాల రూపాంతరంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైంది

- మళ్లీ కెసిఆర్ కెసిఆర్ ను సీఎం చేస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
- తాండూరు మాజీ పైలెట్ రోహిత్ రెడ్డి
- తాండూర్‌లో పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళల సదస్సు
- శ్రీ భావిగి భద్రేశ్వర చౌక్‌లో పోటెత్తిన జనసందోహం.. రోడ్డుపైనే మహిళల వంటావార్పు

**తాండూరు, సెప్టెంబర్ 04(ప్రజా స్వరం ):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేసిందని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ప్రభుత్వ బాధ్యతని, ప్రజలకు రావాల్సిన బాకీ ప్రతి పైసా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తాండూర్ పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర చౌక్ లో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి దాదాపు రెండు వేల మంది తరలిరావడంతో చౌక్ జనసంద్రంగా మారింది. మహిళలు రోడ్డు పైనే వంటావార్పు నిర్వహించి తమ నిరసనను తెలిపారు.

ఈ సందర్భంగా పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఏం జరిగింది? వారికి ఇచ్చిన హామీల్లో ఏవి అమలయ్యాయి? ఏవి అమలు కాలేదు? ప్రజలకు ఎంత బాకీ పడ్డారు? అనే విషయాలను ప్రజల ముందే లెక్క చెప్పేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేశాం అన్నారు.



వృద్ధుల పెన్షన్ సమస్యలు, వికలాంగుల సంక్షేమం, ఉపాధి అవకాశాలు, మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై సదస్సులో ప్రధానంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే తమ లక్ష్యమని రోహిత్‌రెడ్డి అన్నారు.

సంక్షేమ పథకాలు ఎవరి దయాదాక్షిణ్యాలు కావు..

అవి ప్రజల హక్కులు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందాల్సిందే. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిందే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, వాటి అమలు పరిస్థితిని, వివిధ వర్గాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీని అంకెలతో సహా ప్రజలకు వివరించారు.

మాట ఇచ్చారు.. ఓట్లు అడిగారు.. అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు అదే మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదు? ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు.



ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని రోహిత్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో చెప్పిన మాటలను ప్రజలు మర్చిపోలేదు. ఇప్పుడు ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో ప్రజలు లెక్క అడుగుతున్నారు. హామీ ఇచ్చింది ఎవరు? ఓటు అడిగింది ఎవరు? ఇప్పుడు సమాధానం చెప్పాల్సింది కూడా వాళ్లే అన్నారు. బాకీ తీర్చాకే ఓటు అడగలన్నారు. కనపడ్డ చోటే కాంగ్రెస్ నాయకులను గల్లాపట్టుకొని నిలదీయ్యాలని పిలుపునిచ్చారు.

సదస్సుకు హాజరైన వృద్ధులు, వికలాంగులు, మహిళలు తమ సమస్యలను నేరుగా వేదిక వద్ద నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను తెలుసుకున్న రోహిత్‌రెడ్డి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజల తరపున నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు.

ప్రజలు బాధపడుతుంటే చూస్తూ ఊరుకునే పార్టీ బీఆర్ఎస్ కాదు. రైతు అయినా, వృద్ధుడు అయినా, వికలాంగుడు అయినా, మహిళ అయినా.. మీ సమస్య మా సమస్యే. మీ హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం అని అన్నారు.

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, బాకీ పడిన ప్రయోజనాలను అందించాలని రోహిత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రజలకు పడ్డ బాకీ ప్రతి పైసా చెల్లించాల్సిందే. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడుతుంది. ఈ పోరాటం ఒక్కరోజుతో ముగిసేది కాదు.. ప్రజలకు న్యాయం జరిగే వరకు కొనసాగుతుంది అని స్పష్టం చేశారు.

అనంతరం మహిళలతో కలిసి వంటావార్పులో పాల్గొని, వారితో కలిసి భోజనం చేశారు.

కార్యక్రమంలో సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికే విజయలక్ష్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీప నర్సింలు, మున్సిపల్ కౌన్సిలర్లు నవీనా సంతోష్ గౌడ్, రూపారుద్ర పాటిల్, సుప్రీతా కరుణాకర్, నాగలక్ష్మి, మహేశ్వరి, యోగానంద్, జావిద్, ఇర్షాద్, మహిళా నాయకులు శోభారాణి, శకుంతల, అనురాధ, సింధుజా, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, నాయకులు నర్సింలు, శ్రీనివాస్ చారి, వెంకటరెడ్డి, బషారత్, మంకల్ రాఘవేందర్, ఇర్ఫాన్, ఆసిఫ్ తదితరులున్నారు.





# గౌతమి పాఠశాలలో ఘనంగా వేడుకలు

**ప్రజాస్వరం, మనోహరబాద్ :**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో గల గౌతమి పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులను శ్రీ కృష్ణుని వేషధారణలతో అలంకరించి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ విజయ్ కుమార్, ప్రిన్స్ పాల్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# 10వ తరగతి విద్యార్థి అదృశ్యం.. ఎసై సృజన

**నార్సింగి ప్రజా ( స్వరం స్వరం )**

పదవ తరగతి విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీ నార్సింగి గ్రామానికి చెందిన దెబ్బెట లక్ష్మి తన భర్త నర్సింలు అనారోగ్యంతో బాధపడుతుండగా తన ముగ్గురు పిల్లలను ఇంటి వద్ద ఉంచి 1 సెప్టెంబర్ శనివారం చికిత్స కోసం రామాయంపేట లోని ప్రభుత్వ ఆసుపత్రి కు తీసుకుని వెళ్లారు. ఇదిలా ఉండగా చికిత్స అనంతరం శుక్రవారం ఇంటిగి తిరిగి వచ్చిన అనంతరం తన కొడుకు దెబ్బెట జస్వంత్ (14) 2 సెప్టెంబర్ ఆదివారం ఉదయం 11 గం బయటకు వెళ్ళి తిరిగి రాలేదన్న విషయాన్ని కూతురు ద్వారా తెలుసుకున్నారు. అతని ఆచూకీ కోసం బంధు మిత్రుల వద్ద చుట్టూ పక్కల వెతకగా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఒక సారి జస్వంత్ ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోగా మాచారంలో ఉండే తన అమ్మమ్మ వద్ద దొరికాడు. జస్వంత్ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తెల్ల చెక్స్ చొక్కా, తెల్ల రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడని, అతని ఎత్తు 5'6", చామన ఛాయ, కోల ముఖం తో ఉంటాడని తెలిపారు. జస్వంత్ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు గానీ, నార్సింగి పోలీస్ స్టేషన్ కు 8712657895, 8712657938 నంబరు పై తెలుపాలని కోరారు. జస్వంత్ తల్లి ఫిర్యాదు మేరకు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు.



# మండలంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..

**నార్సింగి, (ప్రజా స్వరం ) సెప్టెంబర్ 04**

నార్సింగి మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నార్సింగిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో జన్మాష్టమి సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఉట్టి ఏర్పాటు చేసి చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు సంత దేవయ్య, కార్యదర్శి పోడెండ్ల లక్ష్మణ్ యాదవ్, సామాజిక సమస్త జిల్లా కన్వీనర్ అముద వెంకటేశం, పాఠశాల ప్రధానాచార్యులు తిమ్మిరిశెట్టి బాబా, ఆచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవాళికి భగవద్గీత ద్వారా ధర్మం, కర్తవ్యబోధ, సత్యం, నీతి వంటి గొప్ప సందేశాలను అందించారని తెలిపారు. చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999